ఎలా దొరకుతుంది? ”

“దేని విషయం నువ్వు మాట్లాడు తోంది? ”

“మీ రెడ్ కలర్ బాక్సు.. అదేనండీ స్విస్ బ్యాంకు పాస్‌వర్డ్ దాచిన బాక్సు గురించి..”

“అది ఎర్రగా ఉంటుందని నీకెలా తెలుసు? ..నేను చెప్పలేదే? ” అనుమా నంగా అన్నాడు సహదేవ్.

“ఇంటి వెనక ఉన్న దానిని.. ఇంటి లోపల వెతికితే ఎలా దొరుకుతుందని నేను అంటున్నది దాని గురించే..”

“ఇంటి వెనుకా? ”

“మీ ఇంటి వెనుక కాంపౌండ్‌వాల్‌కి ఆనుకుని అనేక కొండ శిలలు ఉన్నాయా? ”



“అవును.. అది నీకెలా తెలుసు? ”

“తెలుసులెండి! ముందు ఈ విషయం చెప్పండి. ఆ బండరాళ్ళ మధ్య ఒక పెద్ద రాయి.. కింద సన్నగా, పైన వెడల్పుగా.. తన బరువును తానే బ్యాలన్స్ చేసుకోలే నట్లు నిలబడి ఉంటుందా? ”

“నువ్వు చెప్తుంటే చూసినట్లే ఉంది”

“ఆ రాతి కింద గుంట తీసిచూస్తే.. మీ బాక్సు దొరకుతుంది.”

“దీనిని ఏ రకమయిన జోస్యం అంటారు? ”

“దాచి పెట్టినవాడు మాత్రమే చెప్పగలిగే జోస్యం..”

“అంటే? ..”

“ఆ బాక్సు అక్కడ దాచింది నేనే!”

సహదేవ్ చాలాసేపు ఆశ్చర్యం నుండి తేరుకోలేదు.

“అది నీ దగ్గరకు ఎలా వచ్చింది? ”

అనుమానం తీరక అడిగాడు సహదేవ్.

"చెప్తాను. మనిద్దరం క్లారిఫై చేసుకోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. ఒకటొకటిగా చెప్పుకుందాం.. శివరామన్‌కి తన పని చేసి పెట్టటానికి ఒక నైపుణ్యం ఉన్న దొంగ అవసరమని అనుకుని ఉంటాడు. అలాంటి దొంగలు ఎక్కడ ఉంటారని చేస్తున్న ఎంక్వయిరీలో మా ఊరి ప్రస్తావన వచ్చి ఉంటుంది. అక్కడి సీఐ బాజీరావుని ఎవరో పరిచయం చేసి ఉంటారు. అతనితో ఒక చురుకయిన దొంగని కుదిర్చి పెట్టడానికి ఒప్పందం చేసుకుని ఉంటాడు. అందుకే బాజీరావు మా నాన్నని బెదిరించీ, బ్లాక్‌మెయిల్ చేసీ.. ఈ పనికి ఒప్పించాడు. అంతవరకూ ఓకే! కానీ వాడు చేసింది మోసమని మీకు ఎలా తెలిసింది? "

"చాలా యాదృచ్ఛికంగా తెలిసింది. మా కంపెనీలోని ఒక స్టాఫ్ తన వ్యక్తిగత పని మీద రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లాడు. ఆ రోజే జరిగిన కోట్లు విలువ చేసే డీల్ గురించి అక్కడ అతనికి ఎవరో మాట్లాడుకోవటం వినిపించింది. అయితే వారి మాటల్లో ఆ లాండ్ కొన్న వ్యక్తి పేరు నాదికాక వేరే చెప్పుకుంటూ ఉండటంతో.. అతను మరి కాస్త ఎంక్వయిరీ చేశాడు. ఏదో మోసం జరిగిందని భావించి విషయం నాకు చేరవేశాడు. తరువాత నేను రెండు ఫోన్లు చెయ్యగానే అసలు విషయం తెలిసిపోయింది"

"మరి వెంటనే శివరామన్‌ని అడగలేదా? ఇలా ఎందుకు చేయవలసి వచ్చిందని? .."

"ఆ రోజు అతనికి చాలా సార్లు ఫోన్ చేశాను. అతను రిసీవ్ చేసుకోలేదు. రాత్రి పొద్దుపోయాక మెసేజ్ పంపాడు. రాత్రికి ఇంటికి వస్తున్నాను. అప్పుడు మాట్లాడుకుందామని"

"తన మోసం గురించి మీకు తెలిసిందని అతను ఊహించి ఉండడు. అలా అయితే అసలు మిమ్మల్ని కలవనే కలవడు. అతను ఏర్పాటు చేసిన దొంగతనం ఆ రాత్రికి జరగబోతుంది. ఆ సమయంలో అతను అక్కడ ఉండటం వల్ల ఉపయోగం అనుకుని ఉంటాడు. అందుకే అప్పటివరకూ మాట్లాడటానికి కూడా కుదరనంత బిజీగా ఉన్నట్లు నటించి రాత్రికి మీ ఇంటికి వచ్చాడు"

"అంతే అయి ఉంటుంది. వాడి కోసం ఎదురుచూస్తూ కోపంతో నేను పెగ్గు మీద పెగ్గు ఖాళీ చేస్తూ కూర్చున్నాను. వాడు వచ్చేటప్పటికే పూర్తిగా నిషా తలకు ఎక్కి ఉంది.."

"మరి మీ ఇంట్లో ఎవరూ లేరా? "

"ఇంట్లో ఎవరుంటారు? పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. భారతి ఆ రోజే ఊరు వెళ్లింది.."

"అవును ఆవిడ ఊరు వెళ్లటం నేను చూశాను.."

"నువ్వు చూశావా? ఎలా? "

"అదేలెండి. మీ ఇంటిమీద రెక్కీ చేస్తున్నపుడు కనిపించింది.."

"రెక్కీ! అంటే.."

"ఇప్పుడవన్నీ అవసరమా సార్? తరువాత జరిగింది చెప్పండి"

"ఏం జరిగిందో క్లియర్‌గా గుర్తులేదు. మొత్తానికి వాడిని బాగా తిట్టాను. కొట్టానేమో కూడా గుర్తులేదు. వాడు మాత్రం ఏమీ సమాధానం చెప్పిన గుర్తు లేదు"

"అప్పుడు సమయం ఎంత అయింది? "

"అర్ధరాత్రి అయి ఉంటుంది"

"అప్పుడు మా నాన్న మీ ఇంటిలోనే ఉన్నాడు"

"ఏమిటో! మా ఇంట్లో ఎవరెవరున్నారో నిన్నడిగి తెలుసుకోవలసి వస్తోంది" అని చెప్పటం కొనసాగించాడు సహదేవ్.

"చివరకు వాదన పెరిగింది. నాకు ఆవేశం వచ్చింది. పరుగెత్తుకుంటూ పైకి వెళ్లాను. సేఫ్ తెరచి పిస్టల్ తీసుకుని.. అదే వేగంతో కిందకు వచ్చాను.."

"వచ్చేటప్పుడు సేఫ్ మూశారా? తెరిచే ఉంచారా? "

"గుర్తులేదు. అయినా ఆ ఆవేశంలో వేసి ఉండను"

"అప్పటికే సమయం కోసం వేచి చూస్తున్న నా తండ్రికి తెరచి ఉన్న సేఫ్ కనిపించి ఉంటుంది. అదే అదనుగా తనకు కావలసిన బాక్సును చేజిక్కుంచుకుని ఉంటాడు" తనలో తను అనుకుంటున్నట్లు అన్నాడు పాండు.

మళ్లీ సహదేవ్‌వైపు తిరిగి- "అయినా ఎంత కోపం ఉంటే మాత్రం.. తుపాకి తీసుకుని ఎదురుగా కనిపించిన వారినందరినీ కాల్చి చంపటానికి మీకేం అధికారం ఉంది? మీరేమైనా హీరో అనుకుంటున్నారా? "

"నేనెక్కడ కాల్చాను? పిస్టల్ తీసుకుని తూలుకుంటూ కిందకు దిగానా..? అక్కడ శివరామన్ నాకు ఎక్కడా కనిపించలేదు. ఇంతలో ఏమయివుంటాడా? అని అటూ ఇటూ చూస్తున్నంతలో చాటు నుండి వచ్చి ఫ్లవర్ వాజ్‌తో నా నెత్తిన కొట్టాడు"

"ఊ.. తరువాత? "

పాండుకి తన తండ్రి విషయం ఏమన్నా తెలుస్తుందేమోనని ఆత్రుతగా ఉంది.

"నాకు మాత్రం ఏమి తెలుసు? మళ్లీ మెలకువ వచ్చేటప్పటికి కింద పడి ఉన్నాను.."

"ఈ మధ్యలో జరిగింది కొంత నాకు తెలుసు. మీరు కాకుండా మరొక వ్యక్తి మేడమీదకు వచ్చి పారిపోబోతున్న మా నాన్నను బలవంతంగా కిందకు తీసుకువెళ్లాడు. అతని చేతిలో పిస్టల్ ఉంది. కాస్సేపటికి అది పేలింది కూడా! మీరు చెప్పిన వర్ణన బట్టి బహుశా అతను శివరామనే అయ్యుండాలి.."

"అదే కదా! నేను నెత్తి, నోరు బాదుకుని చెప్పినా ఎవరూ పట్టించుకోనిది.. నేను ఎవరినీ చంపలేదని!"

"ఆ విషయంలో నాకు ఏ అనుమానం లేదు. మిగిలింది చెప్పండి.."

"ఏముంది? నాకు మెలకువ వచ్చేటప్పటికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. నెత్తి తడుముకు చూసుకున్నాను. దెబ్బ పెద్దది కాదు. అందుకే వెంటనే మెలకువ వచ్చింది. ఇల్లంతా చీకటిగా ఉంది. తడుముకుంటూ వెళ్ళి లైటు స్విచ్ నొక్కాను. అంతే! పెద్ద పేలుడు జరిగింది! కిచెన్‌లో గ్యాస్ లీకయిందని తరువాత తెలిసింది. నాకు మళ్ళీ స్పృహ తప్పింది.."

"అది తప్ప మీకు వేరే పనేమీ లేదనుకుంటాను. సరిగ్గా టైము చూసుకుని స్పృహ తప్పుతుంటారు" గొణుక్కుంటున్నట్లు అన్నాడు పాండు విసుగ్గా.

అదేమీ పట్టించుకోలేదు సహదేవ్.

"ఇంక తరువాత చెప్పేందుకు ఏముంది? పోలీసులు వచ్చారు. శవం ఇంట్లో ఉంది. అంతకు ముందు శివరామన్ ఇంట్లోకి రావటం చాలామందే చూశారు. అందుకే అతన్ని చంపిన నేరం

కింద నన్ను అరెస్టు చేశారు. పేలిన గ్యాస్ సిలిండర్ ధాటికి శవం బాగా ఛిద్రమై పోయింది. నేను దూరంగా ఉండటంతో నాకేమీ కాలేదు. దానితో నేనే కావాలని పేలుడు సృష్టించానని పోలీసులు నామీద కేసు పెట్టారు. అన్నట్లు చెప్పటం మరి చాను.. శవంలో ఒక బుల్లెట్ కూడా ఉందంట. తరువాత పోస్టుమార్టం రిపోర్టులో తెలిసింది. అది నా పిస్టల్ నుండి పేల్చిందేనని ఫోర్సెనిక్ రిపోర్ట్ వచ్చింది. పిస్టల్ మీద నావి తప్ప వేరే ఎవరివీ వేలి ముద్రలు లేవని కూడా వారే చెప్పారు. నేను ఫుల్లుగా మందుకొట్టి ఉన్నానని డాక్టర్ సర్టిఫికెట్ ఇచ్చాడు. దానితో శివరామన్‌ని చంపింది నేనే అని కోర్టు నమ్మింది. తీరా చూస్తే.. ఆ శివరామన్ బతికే ఉన్నాడు. కానీ.. నా మాటను నమ్మేవారే లేరు..”

“శివరామన్ బతికే ఉన్నాడా? ” కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే అన్నాడు పాండు.

“అవునూ! అయితే..”

“అయితే.. చనిపోయిన వ్యక్తి మా నాన్న..” రెండుకాళ్ళ మధ్య తలపెట్టుకుని రోదిస్తూ అన్నాడు పాండు.

హఠాత్తుగా జరిగిన ఆ పరిణామానికి ముందు ఆశ్చర్యపోయినా.. వెంటనే తేరుకుని పాండుని ఓదార్చాడు సహదేవ్.

కాసేపటికి తేరుకున్నాడు పాండు.

“ఇలాంటిదేదో జరిగుంటుందని ఊహిస్తూనే ఉన్నాను. శివరామన్ పోలీసులతో కుమ్మక్కయ్యాడు. అందుకే అతను చేసిన నేరం మీకూ.. అసలు చెయ్యని నేరం నాకూ ఆపాదించి జైలుకు పంపారు. ఆ రోజు తుపాకీతో బెదిరించి కిందకు తీసుకు వెళ్లిన మా నాన్నను శివరామనే చంపేసి ఉంటాడు. మనిషి పోలికలు తెలియకుండా గ్యాస్ ప్రమాదం సృష్టించి ఉంటాడు. ఆ రోజు స్పష్టంగా నాకు పిస్టల్ మోత వినిపించింది. అది వినిపించిన తరువాతే.. నేను ఆ ప్రదేశం నుండి బయటపడటానికి ప్రయత్నించి బాజీరావు కంట్లో పడ్డాను..”

అర్థమయినట్లు తలూపుతూ.. “శివరామన్ నన్నే అనుకున్నాను.. నిన్ను కూడా చెప్పలేనంత దెబ్బ కొట్టాడన్నమాట..” అన్నాడు సహదేవ్.

“ఇంతకీ చనిపోయింది శివరామన్ కాదని మీకెప్పుడు తెలిసింది? ”

“నాకు మొదట్లో అసలు ఆ అనుమానమే రాలేదు. అందరూ నమ్మినట్లే చనిపోయింది శివరామనే.. అని నేను కూడా నమ్మాను. తాగిన మత్తులో హత్య చేశానని ఆరోపిస్తున్న పోలీసుల వాదనలే నిజమయి ఉంటాయని నమ్మాను. అందుకే కోర్టులో నా కేసు గురించీ.. దాని మీద జరుగుతున్న వాదనల గురించీ పెద్దగా ఉత్సాహం చూపలేదు. అయితే నా ఆరోగ్యం బాగోకపోవటంతో నన్ను నిమ్స్‌లో చేర్చారు..” అంటూంటే పాండు వ్యంగ్యంగా నవ్వటం గమనించి,

“...ఎందుకు నవ్వుతున్నావ్? ” సీరియస్‌గా అడిగాడు.

“నిమ్స్ అంటేనూ..”

“అంత ఎగతాళి అక్కరలేదు. నాకు నిజంగా ఆరోగ్యం బాగోకే చేరాను” అంగీ